# వలసదారుల పీరియాడిక్ డ్రామా



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆగస్ట్‌లో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరిలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా కథ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు దర్శకుడు ప్రశాంత్ నీల్. పీరియాడిక్ కథాంశంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ఇందులో బంగ్లాదేశ్‌లో కష్టాలు అనుభవిస్తున్న తెలుగు వలసదారులను రక్షించే పోరాట యోధుడిగా ఎన్టీఆర్ అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపిస్తారని, ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని తెలిపారు. సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు మైథలాజికల్ టచ్ ఉన్న యాక్షన్ సినిమా కాదని ప్రశాంత్‌నీల్ స్పష్టతనిచ్చారు. ఈ సినిమాలో కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించే అవకాశముందని వార్తలొస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం హిందీ మల్టీస్టారర్ 'వార్-2'తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమా అనంతరం ఆయన 'డ్రాగన్' షూట్‌లో జాయిన్ అవుతారు.



# కంటెంట్‌ను నమ్మి చేశాం


వెన్నెలకిశోర్ టైటిల్‌రోల్ పోషించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. అనన్య నాగళ్ల, సియా గౌతమ్ కీలక పాత్రధారులు. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకులు కె.ఎస్.రవీంద్ర(బాబీ), కల్యాణ్‌కృష్ణ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇదని దర్శకుడు రైటర్ మోహన్ అన్నారు. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో ఈ సినిమాను విడుదల చేస్తున్నానని, ఈ సినిమా చూసి నచ్చలేదని అంటే తన నెంబర్‌కు సంప్రదించవచ్చని, సినిమా విజయంపై అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నామని వంశీ నందిపాటి తెలిపారు. కథ మీద నమ్మకంతో ఉన్నామని, సినిమాలోని అన్ని అంశాలు కొత్తగా అనిపిస్తాయని, తప్పకుండా హిట్ కొడతామని నిర్మాత తెలిపారు. తన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిదని కథానాయిక అనన్య నాగళ్ల తెలిపింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# ఎవరికోసం ఈ విరహ వేదన



విభిన్నమైన కథలను ఎంచుకుంటూ హీరోగా తనకంటూ ఓ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు నిఖిల్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'ది ఇండియా హౌస్'. సాయి మంజ్రేకర్ కథానాయిక. రామ్‌వంశీకృష్ణ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అగ్ర హీరో రామ్‌చరణ్, విక్రమ్‌రెడ్డి.వి భాగస్తులుగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. మంగళవారం సాయి మంజ్రేకర్ పుట్టిన రోజు సందర్భంగా, ఇందులో ఆమె పోషిస్తున్న 'సతి' పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సంప్రదాయ చీరకట్టులో ప్రియుడి గురించి ఆలోచిస్తూ విరహ వేదన అనుభవిస్తున్నట్టుగా ఈ లుక్‌లో సాయి మంజ్రేకర్ కనిపిస్తున్నది. 1905లో జరిగే పీరియడ్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతున్నదని, ప్రేమ, విప్లవం నేపథ్యం ఈ సినిమా కథ ఉంటుందని మేకర్స్ తెలిపారు. అనుపమ్‌ఖేర్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: మయాంక్ సింఘానియా, సమర్పణ: రామ్‌చరణ్, నిర్మాణం: అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్.

# రియల్ కోర్ట్ డ్రామా



వీర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధానపాత్రధారులుగా రూపొందిన లీగల్ థ్రిల్లర్ 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకుడు. శాంతమ్మ, మలికిరెడ్డి నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. తాను లాయర్ కాబట్టే రియల్ కోర్ట్ డ్రామా ఎలా ఉంటుందో చూపించాలని తలంపుతో ఈ కథ తయారు చేసుకున్నానని, ఇప్పటివరకూ ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా రూపొందిందని హీరో వీర్ రెడ్డి తెలిపారు. ఇంకా దర్శకుడు రవి గోగుల, డిస్ట్రిబ్యూటర్ విశ్వనాథ్‌చౌదరి, నిర్మాతలు శాంతమ్మ, మలికిరెడ్డి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: జాక్సన్ జాన్సన్, అనూష్ గోరక్, సంగీతం: శంకర్ తమిరి, నిర్మాణం: సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్.



# 'బరోజ్ త్రీడీ'..ఓ కొత్త ప్రపంచం

మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ టైటిల్ రోల్‌ని పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మాత. ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ 'నేటివ్ త్రీడీలో తీసిన సినిమా ఇది. గత 40 ఏండ్లుగా ఈ ఫార్మాట్‌లో సినిమాను ఎవరూ ప్రయత్నించలేదు. మనలోని బాల్యాన్ని సెలబ్రేట్ చేసిన సినిమా. స్టోరీ టెల్లింగ్ చాలా కొత్తగా ఉంటుంది. బాల మేధావి లిడియన్ నాదస్వరం ఈ సినిమాకు సంగీతాన్నందించాడు. అందరూ ఫ్యామిలీతో కలిసి ఆనందించే చిత్రమవుతుంది' అన్నారు. త్రీడీ, యానిమేషన్స్, వీఎఫ్‌ఎక్స్.. ఇలా అన్ని విభాగాల్లో సినిమా అత్యున్నతంగా ఉంటుందని క్రియేటివ్ హెడ్ టీకే రాజీవ్ కుమార్ తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'కేరళ వెళ్లినప్పుడు మోహన్‌లాల్‌గారు ఈ సినిమాలో చూపించిన సాంగ్స్, విజువల్స్ అద్భుతంగా అనిపించాయి. సాంకేతికంగా చాలా ఉన్నతంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# మ్యాక్స్‌తో మ్యాగ్జిమమ్ సైలెన్స్‌గా ఉండాలి



కన్నడ అగ్రహీరో 'కిచ్చా' సుదీప్ హీరోగా రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మి శరత్‌కుమార్, సునీల్, శరత్ లోహితస్య కీలక పాత్రధారులు. విజయ్ కార్తికేయ దర్శకుడు. కలైపులి థాను నిర్మాత. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఏషియన్ సురేష్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'మా పొలిటికల్ కెరీర్‌కి ఈ రాత్రి చాలా ఇంపార్టెంట్..' అనే వాయిస్ ఓవర్ డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. ట్రైలర్‌లో శరత్ లోహితస్య పొలిటికల్ లీడర్‌లా కనిపించారు. అలాగే సునీల్ విలన్‌గా నటిస్తున్నట్టు ట్రైలర్ చెబుతున్నది. ట్రైలర్ అంతా బైకర్ గ్యాంగ్స్, విలన్స్, పోలీస్.. ఒక టెన్షన్ వాతావరణంలో కనిపించింది. 'చావు ఎదురొచ్చినా సరే మా అబ్బాయి ఒంటరిగా నిలబడి పోరాడతాడు..' అని హీరో తల్లి చెప్పే డైలాగ్‌తో కిచ్చా సుదీప్ ఎంట్రీ మాస్ మెచ్చేలా ఉంది. ఆయన యాక్షన్ ప్యాక్ట్ పవర్‌ఫుల్ రోల్ చేసినట్టు తెలుస్తుంది. 'మ్యాక్స్‌తో మాట్లాడేటప్పుడు మ్యాగ్జిమమ్ సైలెన్స్‌గా ఉండాలి' అనే డైలాగ్‌తో ట్రైలర్ ముగిసింది. సంయుక్త హొర్నడ్, సుకృతి వాగల్, అనిరుధ్ భట్ తదితరులు ఇతరపాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: ఆశ్లేషా, కెమెరా: శేఖర్ చంద్ర, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: వి.క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్.

# నీకిదే కరెక్టని అన్నారు



'చిన్నప్పట్నుంచీ నాకు యాక్టింగ్ అంటే ఇష్టం. మాకు కొన్ని థియేటర్లున్నాయి. వాటిల్లో పనిచేశా. రోజు సినిమాలు చూసేవాడ్ని. ఇంజనీరింగ్ అయ్యాక బిజినెస్ స్టార్ట్ చేశాం. లాభాలు చూశా. సత్యానంద్‌గారి ఇనిస్టిట్యూట్‌లో చేరి యాక్టింగ్ శిక్షణ తీసుకున్నా. 'డ్రింకర్‌సాయి' హీరోగా నా తొలి సినిమా. కానీ విడుదలైంది మాత్రం 'సింధూరం'. రీసెంట్‌గా 'డ్రింకర్ సాయి' మా నాన్న చూశారు. ఆయన ఫస్ట్‌టైమ్ నన్ను మెచ్చుకున్నారు. 'నీకు ఇదే కరెక్ట్' అని ఆశీర్వదించారు. అదే నా విజయం' అని హీరో ధర్మ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. ఐశ్వర్యశర్మ కథానాయిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హీరో ధర్మ విలేకరులతో ముచ్చటించారు. 'వాస్తవంగా ఓ వ్యక్తి జీవితంలో జరిగిన కథ ఇది. నేరుగా వెళ్లి ఆ వ్యక్తిని కలిశాను. అతని లైఫ్‌లో జరిగిన సంఘటనలు తెలుసుకున్నాను. అంతేకాదు, ఆ క్యారెక్టర్ చేసేందుకు చాలామంది డ్రింకర్స్‌ని అబ్జర్వ్ చేశాను. నాకు డ్రింక్ అలవాటు లేదు. అయినా బార్‌లకు వెళ్లి తాగిన వాళ్లను, తాగుతున్న వాళ్లను అబ్జర్వ్ చేశా. ఎంతో కష్టపడి ఈ పాత్ర చేశా. నేనే కాదు, ఈ సినిమాలో పని చేసిన ప్రతి ఒక్కరూ మనసుపెట్టి పనిచేశారు.' అని తెలిపారు.





